• నా కూతురు నాకే గర్వకారణం

వికారాబాద్ అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతికి పుష్పగుచ్ఛం అందజేసి సెల్యూట్ చేస్తున్న తండ్రి ఎస్పీ వెంకటేశ్వర్లు

# కూతురికి తండ్రి సెల్యూట్!

• టీజీపీఏలో అరుదైన ఘటన

హైదరాబాద్, జూన్ 15(నమస్తే తెలంగాణ): తెలంగాణ పోలీస్ అకాడమీలో శనివారం అధికారిక విధుల్లో భాగంగా ఓ తండ్రి తన కూతురికి సెల్యూట్ చేసిన అరుదైన ఘటన చోటుచేసుకుంది. ట్రైనీ ఐపీఎస్‌గా వచ్చిన తన కూతురికి అక్కడే డీడీగా విధులు నిర్వహిస్తున్న తండ్రి పూలబొకే ఇచ్చి సెల్యూట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్‌లో ట్రైనీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఉమాహారతి తెలంగాణ క్యాడర్‌కు చెందిన 2023 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ప్రొబేషన్‌లో భాగంగా శిక్షణలో పాల్గొనేందుకు శనివారం ఆమె తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ)ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె తండ్రి, టీఎస్‌పీఏ డిప్యూటీ డైరెక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. తన కూతురు ఉమాహారతి అక్కడికి రావడంతో చిరునవ్వు నవ్వుతూ ఆమెకు పూలబొకే అందజేసి సెల్యూట్ చేశారు. ఇది చూసి అక్కడివారంతా ఆనందానికి లోనయ్యారు.

## ఐఐసీటీలో రాకెట్ ముడి ఇంధనం తయారు

### ఇంధనాల కొనుగోలులో భారత్‌కు తగ్గనున్న దిగుమతి భారం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 15 (నమస్తే తెలంగాణ): రాకెట్లు, క్షిపణుల వంటి వాటిలో వినియోగించే ఇంధన వనరులను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) పరిశోధకులు అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం దిగుమతి చేసుకుంటున్న ఈ ఇంధనాన్ని దేశీయంగా తయారు చేసుకోగలిగే ఆధునాతన పరిజ్ఞానాన్ని ఐఐసీటీలో రూపొందిస్తున్నారు. ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ సంస్థతో కలిసి ఐఐసీటీ అధిక శక్తి సామర్థ్యం ఉన్న ఇంధన వనరులను రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నది. రాకెట్, మిస్సైల్ ప్రొపెలెంట్ సీఎల్-20గా పిలిచే ఇంధనాన్ని తయారు చేయడానికి టైవ్ (TAIW) ముడి సరుకు అవసరం. ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఎన్ లింగయ్య బృందం డెవలప్ చేసిన కాటలిక్ విధానం ద్వారా తక్కువ పరిమాణంతోనే సులభంగా వినియోగించుకునేలా టైవ్ (TAIW)ను ప్రాసెసింగ్ విధానాన్ని డెవలప్ చేసింది. ఈ టెక్నాలజీ ద్వారా ఇతర దేశాలపై భారత్ ఆధారపడాల్సిన అవసరం లేకుండా స్వయం సమృద్ధి సాధించేందుకు తోడ్పడుతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

## తెలంగాణలో నాలుగు రోజులు వానలు

హైదరాబాద్, జూన్15 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో రాగల నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. రాయలసీమ నుంచి మధ్య బంగాళాఖాతం వరకు సముద్ర మట్టానికి 3.1 నుంచి 5.8 కిలో మీటర్ల ఎత్తు వరకు ఏర్పడిన ద్రోణి ప్రభావంతో ఆసిఫాబాద్ , మంచిర్యాల, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రిభువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

21న పదో అంతర్జాతీయ

## యోగా డే

18 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర సర్కారు

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 21న పదో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ యోగాధ్యాన పరిషత్ సెక్రటరీ ఎం ప్రశాంతి శనివారం తెలిపారు. 21న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హైదరాబాద్‌లోని సంజీవయ్య పార్కు వద్ద యోగా దినోత్సవ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ నెల 18 నుంచి 21 వరకు యోగ, ధ్యానానికి సంబంధించిన కార్యక్రమాల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసినట్టు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభిస్తారని వెల్లడించారు.

**ముందస్తు కార్యక్రమాల వివరాలు**

- 18న ఉదయం 7 నుంచి 8.30 వరకు నెక్లెస్‌రోడ్డులో విద్యార్థులతోయోగావాక్
- 19న ఉదయం 7 నుంచి 8.30వరకు చార్మినార్ వద్ద 4కేఎం యోగావాక్
- 20న ఉదయం 7 నుంచి 8.30 వరకు కేబుల్ బ్రిడ్జి నుంచి కోహినూర్ హోటల్ వరకు 2 కేఎం యోగావాక్
- 21న ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 వరకు సంజీవయ్య పార్కు వద్ద 'మాస్ యోగా డెమాన్‌స్ట్రేషన్'.

## ముగిసిన జీ7 సదస్సు

బారి (ఇటలీ), జూన్ 15: ఏడు దేశాల జీ7 శిఖరాగ్ర సదస్సు శనివారంతో విజయవంతంగా ముగిసినట్టు సదస్సుకు ఆతిథ్యమిచ్చిన ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ప్రకటించారు. ద్వైపాక్షిక సంబంధాలు పెంపు, వ్యూహాత్మక భాగస్వామ్యం వంటి అంశాలపై వివిధ దేశాల ప్రతినిధులతో విస్తృతంగా చర్చలు జరిగినట్టు వివరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులకు ఇండో-పసిఫిక్ ప్రాంతం పట్ల ఉన్న నిబద్ధత చైనాకు స్పష్టమైన సంకేతంగా ఆమె అభివర్ణించారు. తాము ఏ విషయంలోనైనా బహిరంగ చర్చలకు సిద్ధంగా ఉన్నట్టు ఆమె ప్రకటించారు. అందులో భాగంగానే భారత్‌తో ఆమె శుక్రవారం చర్చలు జరిపారు.

# విమానాల్లో తిరుగుతూ చోరీలు

110 రోజుల్లో 200 సార్లు దొంగతనం.. నిందితుడి అరెస్టు • రూ. కోటి బంగారం స్వాధీనం

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ నారాయణరెడ్డి, ఇతర పోలీస్ అధికారులు

శంషాబాద్ రూరల్, జూన్ 15: విమానాల్లో తిరుగుతూ దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగను శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులు అరెస్టుచేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి రూ. కోటి విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను శంషాబాద్ జోన్ డీసీపీ నారాయణరెడ్డి శనివారం తన కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. ఢిల్లీకి చెందిన రాజేశ్‌సింగ్ కపూర్ జల్సాలకు అలవాటుపడి విమానాల్లో తిరుగుతూ సంపన్న కుటుంబాల మహిళలను టార్గెట్ చేసేవాడు. సదరు మహిళలు బ్యాగులను క్యాబిన్‌లో భద్రపరిచే సమయంలో తన బ్యాగును కూడా దొంగ అక్కడే పెట్టేవాడు. వారు వాష్‌రూంకు వెళ్లిన సమయంతో తన బ్యాగులో వస్తువులు తీసుకుంటున్నట్టు నటిస్తూ మహిళల బ్యాగులో ఉన్న బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను తీసుకొని బ్యాగులో వేసుకొనేవాడు. ఇలా దోచుకున్న ఆభరణాలను బంగారం దుకాణాదారులకు అమ్ముతుండేవాడు. రాజేశ్‌సింగ్ హైదరాబాద్-బెంగళూరు. బెంగళూరు-ఢిల్లీ, ముంబై-ఢిల్లీ ఇలా కనెక్టివిటీ విమానాల్లో అధికంగా ప్రయాణం చేసి దాదాపు కిలోకుపైగా బంగారం ఆభరణాలు దోచుకున్నాడు. 110 రోజుల్లోనే 200 సార్లు విమానాల్లో ప్రయాణించిన ఈ ఘరానా దొంగపై బాధిత మహిళలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. సీసీపుటేజ్ ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. ఇతడికి సహకరించిన మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. రాజేశ్‌సింగ్‌పై పదికిపైగా కేసులు ఉన్నాయి. ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌తోపాటు రాచకొండ కమిషరేట్ పరిధిలో కూడా ఇతడిపై కేసులు ఉన్నాయి.

## వనపర్తి జిల్లాలో పురాతన రాతి శిల్పాలు లభ్యం

హైదరాబాద్, జూన్ 15(నమస్తే తెలంగాణ): వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం, సూగూరు గ్రామంలో పురాతన ఆలయం, శిల్పాలను కొత్త తెలంగాణ చరిత్ర బృందం గుర్తించింది. ఇందులో ఒకటి రాచరికపు ఆహార్యంతో, శైవతాంత్రిక యోగాసనంలో కూర్చున్న పండితుడి విగ్రహం. ఈ విగ్రహానికి కుడిచేత గంటం, ఎడమచేత పుస్తకం కనిపిస్తున్నాయి. ఇది 10,11వ శతాబ్దపు శిల్పంగా భావిస్తున్నారు. ఇక్కడే మరో అరుదైన శిల్పాన్ని కూడా గుర్తించారు. దీన్ని స్త్రీ ఆత్మాహుతి శిలగా భావిస్తున్నారు. ఇందులో ఓ స్త్రీ పద్మాసనంలో అంజలి ముద్ర పట్టి కూర్చొని ఉంది. తలపై రుద్రాక్షల కిరీటం, భుజాలు, దండరెట్టలు, ముంజేతులకు రుద్రాక్షమాలలు, చెవులకు కుండలాలు కూడా ఉన్నాయి. అర్ధనగ్నంగా ఉన్న ఈ స్త్రీ తలపైన శివలింగం ధరించి ఉంది. సిద్ధిపేట జిల్లా కంచరిమల్యాల, పందిళ్లలో ఈ శిల్పాన్ని పోలిన స్త్రీల ఆత్మాహుతి శిల్పాలను గతంలో గుర్తించినట్లు చరిత్ర బృందం తెలిపింది. ఈ శిల్పం 15వ శతాబ్దానికి చెందినదని భావిస్తున్నారు. ఈ బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్, బైరోజు చంద్రశేఖర్, బైరోజు శ్యామ్‌సుందర్ తదితరులున్నారు.

## మెదక్‌లో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- ఓ ప్రైవేట్ దవాఖానపై రాళ్ల దాడి
- డాక్టర్ కారు అద్దాలు ధ్వంసం
- పోలీసుల లాఠీచార్జి.. షాప్‌లు బంద్

మెదక్, జూన్ 15 (నమస్తే తెలంగాణ)/మెదక్ అర్బన్: మెదక్ పట్టణంలో శనివారం రాత్రి 7 గంటలకు రెండు వర్గాల మధ్య గొడవకు దారితీసింది. గోవధను నిషేధించాలని ఓ వర్గం వారు శనివారం మధ్యాహ్నం పట్టణంలో ఆందోళనకు దిగారు. బంగ్లా చెరువు వద్ద గోవులు కనిపించడంతో ఓ వర్గం వారి కోసం వధించేందుకు తెచ్చారని మరో వర్గం వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బంగ్లా చెరువు వద్ద గోవులను కస్టడీలోకి తీసుకున్నారు. నర్సిఖేడ్‌లో ఇంకొన్ని ఆవులున్నాయని పోలీసులకు తెలుపడంతో సీఐ అక్కడికి వెళ్తుండగా, ఓ వర్గానికి చెందిన వ్యక్తి మరోవర్గం యువకుడిపై కత్తితో దాడిచేశాడు. ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకోగా, ఇరువర్గాలు రాళ్ల దాడికి దిగారు. ఈ ఘటనలో ఓ ప్రైవేట్ దవాఖాన అద్దాలు, డాక్టర్ కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు లాఠీచార్జితో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. దుకాణాలను మూసి వేయించిన పోలీసులు పట్టణంలో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

లోకం పోకడ

తప్పంటారేం?.. ఇదెక్కడి అన్యాయం సార్.. మేం కూడా అలా డబ్బులు ఇచ్చే టీచర్లం, ప్రిన్సిపాళ్లం అయ్యాం!

## యువతకూ మధుమేహ ముప్పు

### తాజా నివేదికలో కిమ్స్ వైద్యుల వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 15 (నమస్తే తెలంగాణ): శరీరాన్ని నిర్వీర్యం చేసే మధుమేహ (డయాబెటిస్) వ్యాధి ఇప్పుడు యువతను సైతం పీడిస్తున్నది. ప్రస్తుతం మన దేశంలో దాదాపు 10.1 కోట్ల మంది టైప్-2 డయాబెటిస్ వ్యాధితో బాధపడుతున్నారని, వారిలో ఎంతో మంది యువత ఉన్నారని హైదరాబాద్ కొండాపూర్‌లోని కిమ్స్ దవాఖాన వైద్యులు తెలిపారు. ఊబకాయం, మెటబాలిక్ సిండ్రోమ్, ఫ్యామిలీ హిస్టరీ, జీవనశైలిలో ఎలాంటి మార్పులు లేకపోవడం తదితర అంశాలు డయాబెటిస్‌కు కారణమని తాజా నివేదికలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో వయోజనులంతా తరచుగా షుగర్ టెస్ట్ చేయించుకోవాలని సూచించారు. వ్యాయామంతోపాటు జీవనశైలిని మార్చుకోవడం, ఫైబర్, ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం, రోజూ కనీసం 7-9 గంటలపాటు నిద్రపోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం, ధూమపానానికి దూరంగా ఉండటం ద్వారా మధుమేహాన్ని నిరోధించవచ్చని కిమ్స్ వైద్యుడు డాక్టర్ కృష్ణారెడ్డి తాడూరి తెలిపారు.

## 'ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టాన్ని రద్దు చేయాలి'

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో పోడు భూముల సమస్యలు తీరాలంటే ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, అటవీ శాఖ అధికారులపై దాడులను అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలని తెలంగాణ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నరేందర్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగా పోడు చేస్తున్న వారిని అడ్డుకుంటున్న అటవీ ఉద్యోగులపై కొందరు దళారులు దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాణిజ్య

## నెక్సాన్‌పై లక్ష రూపాయల ఆఫర్

ముంబై, జూన్ 15: ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్స్‌కి చెందిన ఎస్‌యూవీ నెక్సాన్ మరో మైలురాయిని అధిగమించింది. దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చి ఏడేండ్లు పూర్తైన సందర్భంగా ఈ వాహనంపై ప్రత్యేక ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు ప్రకటించింది. 2017 నుంచి 2024 వరకు ఏడేండ్లలో ఏడు లక్షల యూనిట్ల వాహనాలను విక్రయించినట్లు కంపెనీ చీఫ్ కమర్షియల్ అధికారి వివేక్ శ్రీవాత్సవ తెలిపారు. డిజైనింగ్, భద్రత, కంఫర్ట్, సులభంగా డ్రైవింగ్ చేసే వీలుగా డిజైనింగ్ చేయడం వల్లనే ఈ మాడల్‌కు కస్టమర్ల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.

## విజయవాడ-ముంబై ఎయిర్ ఇండియా ఫ్లైట్

మచిలీపట్నం, జూన్ 15: విజయవాడ నుంచి ముంబైకి డైరెక్ట్ విమాన సేవలు ప్రారంభించింది ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్. గన్నవరంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ విమాన సేవలు శనివారం ప్రారంభించారు. ముంబైలో మధ్యాహ్నం 3.55 గంటలకు బయలుదేరనున్న ఏ-320 విమాన సర్వీసు విజయవాడకు సాయంత్రం 5.45కి చేరుకోనున్నది. తిరుగు ప్రయాణంలో విజయవాడలో 7.10 గంటలకు బయలుదేరి ముంబైకి రాత్రి 9 గంటలకు చేరుకోనున్నది.

## ఇంధనాలపై విండ్‌ఫాల్ ట్యాక్స్ తగ్గింపు

న్యూఢిల్లీ, జూన్ 15: ఇంధనాలపై విధించే విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను కేంద్ర ప్రభుత్వం మరోసారి తగ్గించింది. టన్ను క్రూడాయిల్‌పై విధించే విండ్‌ఫాల్ ట్యాక్స్‌ని రూ.5,200 నుంచి రూ.3,250కి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. తగ్గించిన రేట్లు శనివారం నుంచి అమలులోకి వచ్చాయి. తొలిసారిగా కేంద్ర ప్రభుత్వం ఈ విండ్‌ఫాల్ ట్యాక్స్‌ని జూలై 1, 2022న విధించిన విషయం తెలిసిందే.

# ఎస్బీఐ వడ్డీరేట్ల పెంపు

నూఢిల్లీ, జూన్ 15: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) రుణ గ్రహీతలకు షాకిచ్చింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని 10 బేసిస్ పాయింట్లు పెంచింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో వాహన, గృహ రుణాలపై చెల్లింపులు మరింత భారంకానున్నాయి. శనివారం నుంచి అమలులోకి వచ్చిన ఈ రుణాల్లో ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్ రేటు 8.65 శాతం నుంచి 8.75 శాతానికి సవరించింది. వాహన రుణాలు ఏడాది కాలపరిమితితో, వ్యక్తిగత రుణాలు రెండేండ్ల కాలపరిమితితో మంజూరు చేస్తున్నది బ్యాంక్. దీంతో బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటు 8.10 శాతం నుంచి 8.95 శాతం మధ్యలో లభించనున్నాయి.

**ఎఫ్‌డీలపై కూడా..**

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేటును బ్యాంక్ సవరించింది. గతంలో రూ.2 కోట్ల లోపు డిపాజిట్లపై వడ్డీరేటును పెంచిన ఎస్బీఐ..తాజాగా రూ.3 కోట్ల లోపు డిపాజిట్లపై వడ్డీరేటును 75 బేసిస్ పాయింట్ల వరకు సవరించింది. ఏడు రోజుల నుంచి 45 రోజుల లోపు డిపాజిట్లపై వడ్డీని 3.5 శాతం నుంచి 4 శాతానికి, 46 రోజుల నుంచి 179 రోజుల వడ్డీరేటు 5.5 శాతం నుంచి 6 శాతానికి, 180-210 రోజుల లోపు ఎఫ్‌డీలపై 6.75 శాతానికి, 211 రోజుల నుంచి ఏడాది లోపు ఎఫ్‌డీలపై వడ్డీని 6.5 శాతం నుంచి 7 శాతానికి సవరించింది. అలాగే ఏడాది నుంచి రెండేండ్ల లోపు టర్మ్ డిపాజిట్లపై వడ్డీరేటును 6.8 శాతం నుంచి 7.3 శాతానికి, 2 ఏండ్ల నుంచి మూడేండ్ల లోపు కాలపరిమితి డిపాజిట్లపై వడ్డీని 7.5 శాతానికి పెంచింది. మూడేండ్ల నుంచి ఐదేండ్ల లోపు డిపాజిట్లపై వడ్డీరేటును 6.75 శాతం నుంచి 7.25 శాతానికి సవరించిన బ్యాంక్, ఐదేండ్ల నుంచి 10 ఏండ్లలోపు డిపాజిట్లపై వడ్డీరేటును 7.50 శాతానికి పెంచింది.

ఎంసీఎల్ఆర్‌ని 10 బేసిస్ పాయింట్లు పెంచిన బ్యాంక్

## మరో ఐదు బ్యాంకులు కూడా..

ఎస్బీఐతోపాటు మరో ఐదు బ్యాంకులు ఎంసీఎల్ఆర్ రేట్లను సవరించాయి. వీటిలో హెచ్‌డీఎఫ్‌సీ, యెస్ బ్యాంక్, కెనరా, పీఎన్‌బీ, ఐడీబీఐ బ్యాంకులు ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎంసీఎల్ఆర్‌ని 5 బేసిస్ పాయింట్లు సవరించింది. దీంతో రుణాలపై వడ్డీ రేటు 9 శాతం నుంచి 9.35 శాతం మధ్యలోకి చేరాయి. అలాగే యెస్ బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటు 9.25 శాతం నుంచి 10.60 శాతం మధ్యలో ఉండగా, కెనరా బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటు 8.15 శాతం నుంచి 9.30 శాతంలోకి, పీఎన్‌బీ రేటు కూడా 8.25 శాతం నుంచి 9.10 శాతం మధ్యలో వసూలు చేస్తున్నది. అలాగే ఐడీబీఐ బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటు 8.35 శాతం నుంచి 10 శాతం లోపు నిర్ణయించింది.

**బ్యాంక్ ఎంసీఎల్ఆర్ తీరు..**

- ఒక్కరోజు రుణాలపై ఎంసీఎల్ఆర్ 8 శాతం నుంచి 8.10 శాతానికి..
- నెల, మూడు నెలల కాలపరిమితి రుణాలపై వడ్డీరేటు 8.20 శాతం నుంచి 8.30 శాతానికి
- ఆరు నెలల కాలపరిమితి రుణాలపై ఎంసీఎల్ఆర్ 8.55 శాతానికి పెంచింది. అంతకుముందు ఇది 8.45 శాతానికి..
- ఏడాది రుణాలపై ఎంసీఎల్ఆర్ 8.55 శాతం నుంచి 8.65 శాతానికి సవరించింది
- రెండేండ్ల కాలపరిమితి రుణాలపై రేటు 8.75 శాతం నుంచి 8.85 శాతానికి పెంచింది.
- మూడేండ్ల రుణాలపై ఎంసీఎల్ఆర్ 8.85 శాతం నుంచి 8.95 శాతానికి సవరించింది.

**బ్యాంక్ బేస్ రేటు**

10.40 శాతంగా నిర్ణయించింది.

**ఎంసీఎల్ఆర్ అంటే**

మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్(ఎంసీఎల్ఆర్) కంటే తక్కువ వడ్డీరేటుకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకులకు అవకాశం లేదు.

10 వేల మంది నియామకాలను వాయిదావేసిన కంపెనీలు

## ఫ్రెషర్లకు ఐటీ సంస్థల దెబ్బ!

న్యూఢిల్లీ, జూన్ 15: దేశీయ ఐటీ సంస్థలు గడ్డుపరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయ దేశాలపై ఆర్థిక మాంద్యం పిడుగుపడటంతో ఐటీ సంస్థలు నిర్వహణ ఖర్చులను తగ్గించుకోడానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. ఇప్పటికే పలు ఉద్యోగులను తొలగించిన సంస్థలు..తాజాగా క్యాంపస్‌ల నుంచి రిక్రూట్ చేసుకున్న ఉద్యోగులకు నియామకాలను నిలిపివేశాయి. దేశీయ ఐటీ దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, ఎల్‌టీఐమైండ్‌ట్రీ, జెన్సర్‌లు ఏకంగా 10 వేల మంది ఫ్రెషర్లకు మొండిచెయ్యి చూపించాయి సంస్థలు. ఆన్ బోర్డింగ్‌లోవున్న ఉద్యోగులకు నిరాశతప్పటం లేదని నాస్కాంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయిస్ సెనేట్(ఎన్ఐటీఈఎస్) విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. దేశీయ టాప్ ఐటీ సంస్థల్లో ఉద్యోగం వచ్చిందని సంబరపడుతున్న ఫ్రెషర్ల ఆశలు గండికొడుతున్నాయని ఎన్ఐటీఈఎస్ ప్రెసిడెంట్ హర్పీత్ సింగ్ సాలుజా తెలిపారు. ముఖ్యంగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రోలో ఉద్యోగుల సంఖ్య సంయుక్తంగా 64 వేల వరకు తగ్గాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 50 వేల మంది ఫ్రెచర్లను నియమించుకున్న ఇన్ఫోసిస్..ఈసారి 11,900 మందిని మాత్రమే రిక్రూట్ చేసుకున్నది. రెండేండ్ల క్రితం భారీ స్థాయిలో సిబ్బందిని రిక్రూట్ చేసుకోనున్నట్లు ప్రకటించిన సంస్థలు ప్రస్తుతానికి వెనుకంజవేస్తున్నాయి. అంతర్జాతీయ క్లయింట్లు ఖర్చులు తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యతనివ్వడం కూడా రిక్రూట్‌మెంట్లకు బ్రేక్‌పడినట్లు అయింది. అంతర్జాతీయ ఆర్థిక రంగంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా ఈ సారి ఎంత మందిని ఫ్రెషర్లను తీసుకునేదానిపై ఇంకా స్పష్టత రాలేదని ఐటీ ప్రతినిధి ఒకరు చెప్పారు. 2022లో మొత్తం రిక్రూట్‌మెంట్లలో 3-5 శాతం వరకు ఫ్రెషర్లను నియమించుకున్న టాప్ ఐటీ సంస్థలు.. ఇప్పటి వరకు వారికి ఎలాంటి రోల్‌ను అప్పగించలేదని టీమ్‌లీజ్ వెల్లడించింది. ప్రాజెక్టులు తగ్గుముఖం పట్టడం, ఫ్రెషర్లలో ప్రతిభ లేకపోవడం కూడా ప్రధాన కారణాలని పేర్కొంది. టీసీఎస్‌లో 2021-22లో 59 శాతంగా ఉన్న యువ ఉద్యోగుల వాటా గత ఏడాది 50.3 శాతానికి తగ్గింది.

ధర రూ.1.09 లక్షలు

## నెక్సస్ సరికొత్త ఈ-స్కూటర్

చెన్నై, జూన్ 15: దేశీయ మార్కెట్లోకి సరికొత్త ఫ్యామిలీ ఎలక్ట్రిక్ స్కూటర్ యాంపిర్ నెక్సస్‌ను పరిచయం చేసింది గ్రేవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ సంస్థ. చెన్నై షోరూంలో ఈ స్కూటర్ ధర రూ.1,09,900. ఈ సందర్భంగా కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో కే విజయ కుమార్ మాట్లాడుతూ..30 శాతం అధిక బ్యాటరీ లైఫ్, మరింత పవర్‌పుల్‌తో తీర్చిదిద్దిన ఈ స్కూటర్ నాలుగు రంగుల్లో లభించనున్నదన్నారు. ప్రస్తుతానికి చెన్నైలో లభించనున్న ఈ స్కూటర్ దశలవారీగా దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# పొదుపు ట్రెండ్ మారుతున్నది..

- చేతిలో డబ్బులు ఉంచుకునేందుకు ప్రజల ఆసక్తి
- మారుతున్న సేవింగ్స్ పద్ధతులపై హోం క్రెడిట్ అధ్యయనం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 15 (నమస్తే తెలంగాణ): నాభి నిండితే నవాబుకైన జవాబు చెప్పొచ్చు అనేది పాత సామెతగా మారింది. జేబు నిండుగా పైసలు ఉంటే నవాబులాగైనా బతకొచ్చనేది నేటి విధానంగా... పొదుపు విధానంలో మార్పు వస్తున్నది. ఇటీవల కాలంలో మెట్రో నగరాల్లో నివసించేవారు పొదుపు చేసే పద్ధతిని మార్చుకుంటున్నారు. తాజాగా హోం క్రెడిట్ సంస్థ చేసిన అధ్యయనంలో చేతిలో డబ్బులు ఉంచుకోవడమే అసలైన పొదుపుగా భావిస్తున్నట్లుగా తేలింది. గతంలో మాదిరిగా స్టాక్ మార్కెట్లు లేదా డిపాజిట్లు, ఇతర ఆర్థిక మార్గాల్లో పెట్టుబడి పెట్టిన వాళ్లే... ఇప్పుడు వాటన్నింటికంటే చేతిలో డబ్బులు ఉంచుకోవడమే సురక్షితమని అనుకుంటున్నట్లుగా తన నివేదికలో వెల్లడించింది. ఒకవైపు సైబర్ నేరాలు, మరోవైపు స్టాక్ మార్కెట్ల భారీ నష్టాలతో పొదుపు విషయంలో జనాభిప్రాయం మారుతున్నదని అధ్యయనంలో తేలింది. సంపాదించిన పైసలు కళ్ల ముందర ఉండటమే మంచిదనే భావన ఎక్కువైపోయింది. ఆన్‌లైన్ మోసాలు, నష్టాల భయం కారణంగా డబ్బులను ఇతర మార్గాల్లో పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజవేస్తున్నారు. పాత కాలంలో మాదిరిగా సంపాదించిన డబ్బులను ఇంట్లో నిల్వ చేసుకునే విధానం ఇటీవల కాలంలో భారీగా పెరిగిందనీ చెబుతున్నారు. దేశంలోని అన్ని మెట్రో నగరాలను ప్రామాణికంగా తీసుకుని చేసిన అధ్యయనం ద్వారా మెజార్టీ జనాలు క్యాష్ సేవింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా స్పష్టమైంది. చేతిలో డబ్బులు ఉంటేనే ఆర్థిక స్వతంత్రత, సాధికారికతగా భావిస్తున్నారు. ఈ తరహా ఆలోచన ధోరణి మహిళల్లో ఎక్కువగా ఉండేదని, కానీ మగవారు కూడా ఇదే తరహా పొదుపు మంచిదనే భావనతో ఉన్నారు.

**దక్షిణాదిలోనూ ఎక్కువే..**

దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో డబ